స్వతంత్రంగా నిర్మొహమాటంగా అడిగి పట్టుకెళ్తారు.

పాల పేకెట్ ధర మా వీధిలో బైటకన్నా ఇరవై పైసలెక్కువ. గుడ్డు ఐదు పైసలెక్కువ. మాంసం కేజీమీద రెండు రూపాయలెక్కువ. 'ఎక్కువ ఎక్కువ అనే బదులు బజారుకి పోయి తెచ్చుకోరాదు? మాదగ్గరే కొనమని మిమ్మల్ని మేం బలాత్కారం చేసేమా?' అంటాడొకసారి. 'ఏం చెప్పాలి సార్. పాల క్రేట్లు అంత దూరం పోయి మోసుకొస్తాం కదా. ఆ శ్రమకి ఐదు పైసలు ఇయ్యరా సార్?' అంటాడింకోసారి. 'ఛస్తున్నా ననుకోండి, ఈ చిన్న ఆఫీసర్లని కట్టుకోలేక-' అంటాడు మరోసారి.

★

# 37. దగాపడని తమ్ముడు

"బ్యాంకిలోనూ, రిజిస్ట్రారాఫీసులోనూ, కలెక్టరాఫీసులోనూ ఏవో పన్లున్నాయిట; మా తమ్ముడు ఇరవై తొమ్మిదో తారీకున వస్తానని కబురు చేసేడు. నేను కుటుంబంతో సహా తిరుపతి వెళ్తున్నాను. అంచేత నిన్ను కలవమన్నాను. రెండురోజులు సెలవు పెట్టయినా సరే వాడి పన్లు అయ్యేటట్టు చూడు; లేకపోతే వాడితో లేనిపోని గొడవ!" అని చెప్పేసి అప్పారావు వెళ్లేడు. సరేలే-అన్నాను.

" మీ పలుకుబడివల్ల నా పనులన్నీ సక్రమంగా జరిగిపోయాయి. రెండురోజులు సెలవైతే పెట్టేరుగాని ఈ ఆఫీసుల చుట్టూ తిరగడంతో మీకు నానాయాతనా ఐంది. రేపూ ఎల్లుండీ మీకు సెలవు దినాలు కనక నాతో మావూరొచ్చేయండి. మిమ్మల్ని సత్కరిస్తాను" అన్నాడు సింహాచలం.

"మన్లో మనకి సన్మానాలూ సత్కారాలూ ఎందుకు? నాకు మీ అన్నయ్య ఎంతో మీరూ అంతే. ఇదే మీ అన్నయ్యయితే మీ సత్కారానికి ఆశిస్తాడేమిటి?" అన్నాను.

"మా అన్నయ్యకి నా సత్కారం ఒక్కటీ తక్కువొచ్చిందా యేమిటి? ఏదో పల్లెటూరి వాళ్లం, మమ్మల్ని పట్నం బాబులు దగాచేస్తూనే ఉంటారు. మీరు ఆదుకున్నారు గనకా సరిపోయింది. పదండి, పదండి!" అన్నాడు సింహాచలం.

ఆ విధంగా వెళ్లేను, ఆ పల్లెటూరికి. రోడ్డుమీద ఉన్న ఓ వూళ్లో బస్సు దిగగానే అక్కడున్న ఒక టీ దుకాణంలో నన్ను కూర్చోబెట్టి, ఎవరింటికో వెళ్లి, తను రెండురోజుల కిందట అక్కడ దాచిన బులెట్టు మోటారు సైకిల్ తెచ్చేడు. దానిమీద కూర్చోబెట్టి నాలుగు మైళ్ల బ్రాంచి రోడ్డుమీద తీసికెళ్లాడు, వాళ్లవూరికి.

పల్లెటూరంటే పూరిగుడిసెలూ, అనారోగ్యం, అవిద్య, సదుపాయాలలేమి-అని నాకు భయం. కాని సింహాచలం నన్ను తీసికెళ్లిన ఆ వూళ్లో పూరిగుడిసెలు పట్టణాల్లో మురికి వాడలకన్నా శుభ్రంగా ఉన్నాయి. రోడ్డు పడ్డాది, కరెంటుంది. సందు సందుకీ గొట్టాం బావులున్నాయి. సింహాచలం ఇల్లయితే మరీ బావుంది. అర ఎకరం స్థలంలో రెండు వాసల్లో పెంకుటిల్లు అది. ముందు వాసలో ఒక భాగం డాబా, అక్కడొక గది. నుయ్యి, పంపు సెట్టు ఓవర్ హెడ్డు టాంకి, కరెంటు ఆగిపోతే జనరేటరు. పశువుల సాల విడిగా ఉంది. అందులో

రెండు జతల ఎడ్లు, ఒక జత పోతులు, రెండు గేదెలు. ఇంట్లో కలర్ టి.వి., రేడియో, వి.సి.ఆర్. ఉన్నాయి. పుస్తకాలూ న్యూస్‌పేపర్లూ లాంటి చెత్త అట్టే లేదు. ఇలాంటి ఇళ్లు ఆ వూళ్లో పదహారున్నాయి.

ఇల్లు అప్పారావు పూర్వీకులు కట్టించిందే గాని పొలం మాత్రం ఇంచుమించు అంతా అప్పారావు ఉద్యోగంలో చేరేక వాళ్లనాన్న సంపాదించిందే. అప్పారావు ఉద్యోగంలో చేరిన ఐదేళ్ల వరకూ పెళ్లి చేసుకోకుండా ఇంటికి డబ్బు పంపితే అంతకి ముందున్న ఎకరంనర పల్లపుభూమి కాక కొత్తగా చేరింది అయిదెకరాల మెరకా, రెండెకరాల పల్లం. "సింహాచలం చదువుకోలేదు కనక ఇవన్నీ వాడికి వదిలెయ్యి. నీజీతంతో నీకు జరగని కాలం వొస్తే ధాన్యమో అపరాలో పంపిస్తాడు " అని తండ్రి మరణశయ్య మీద చెప్పేడుకదా అని అప్పారావు పట్నంలో తన బాధలేవో తను పడుతూ కాలక్షేపం చేస్తున్నాడు. సింహాచలం మెరకా పల్లం దక్షతగా వ్యవసాయం చేయిస్తూ ఉన్న ఆస్తిని పెంచేడు. ఇప్పుడు సింహాచలం చేతికింద పాతికెకరాల భూముంది.

నేను ఇంట్లో అడుగు పెట్టగానే నన్నొక కుర్చీలాంటి దాన్లో కూచోబెట్టి భార్యని కేకేశాడు. "అన్నయ్య నేస్తుడు. పట్నంలో ఆపీసరు. మనింటికాడ రెండ్రోజులుంతారు" అని పరిచయం చేసేడు.

"దండాలండి" లోపలికెళ్ళిపోయిందావిడ.

"పిల్లలేరీ?"

"నాకిద్దరూ కొడుకులే, మీకు తెల్సుగా. ఇక్కడ సరిగ్గా చదువుకోరని, రెసిడెన్షియల్ స్కూల్లో పెట్టేశాను. హైద్రాబాదులో ఉన్నారు."

"మీ అన్నయ్యగారింట్లో వుంచి చదివించవొచ్చు కదా?" అన్నాను.

"మీ వూళ్లో స్కూళ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. పైగా అన్నయ్యకి వీళ్లభారం కూడా ఎందుకు? ఖర్చుల దగ్గిరా పోషకాహారం దగ్గిరా తగువులొస్తాయని కూడా అనిపించి అలా చేశాను. దూరమూ డబ్బు ఖర్చూ అయితే అయ్యాయి కానీ చదువు బాగుంటుందక్కడ. పైగా మకాం, తిండీ, ఆట పాటలు అన్నీ స్కూలువాళ్లే బాధ్యతగా చూస్తున్నారు".

అప్పారావుకి ఇద్దరు కూతుళ్లు, వాళ్లనడుమ ఒక కొడుకు. ఆడ పిల్లలిద్దరూ జడ్.పీ. హైస్కూల్లోనూ, మొగపిల్లాడు కాన్వెంట్‌లోనూ చదువుతున్నారు. అద్దె ఇల్లు. పెళ్లిచేసుకోక ముందు ఏం సుఖంగా ఉన్నాడో; అంతే. తెచ్చిన జీతం బొటాబొటీగానైనా సరిపోడం లేదు. విశాఖపట్నం నిండా "అప్పు"లే.

ఆ రాత్రికి డాబా మీదున్న గదిలో పెట్టేడు నన్ను. ఓ మూలగా బస్తాలు పేర్చి వున్నాయి. ఇరవై రెండున్నాయి.

"మంచి రకం సన్న బియ్యమండి. లచ్చుమ్మ చెరువు కింద పొలంలో పండినవి. సొంత వాడకానికి ఉంచేసుకున్నాం."

"ఇన్ని ఉన్నాయి కదా, మీ అన్నయ్యకి నాలుగో అయిదో బస్తాలు పంపరాదూ? పాపం నానా అవస్తా పడుతున్నాడు" అన్నాను.

"సర్లెండి, మీదంతా సత్తెకాలం" అన్నాడు సింహాచలం. ఆతరవాత మాటల్లో తెలిసింది. ఏడాది పొడుగునా వాడుకున్నాక మిగిలినవి మంచి రేటుకి అమ్మితే తప్పా ఇక్కడా, పట్నంలోనూ, హైదరాబాదులోనూ తను పెడుతున్న ఖర్చులకి ఎటామటీ అయిపోతుందిట.

సింహాచలం వ్యవసాయమే కాక వ్యవసాయ సంబంధమైన దళారీసన్లు కూడా చేస్తాడు. పొలాల మీద గానీ, పంట మీదగానీ ఋణాలు కావాలంటే ఎవర్నో పట్టి ఇంకెవర్నో పట్టించి పన్లు సానుకూల పరుస్తాడు. నూటికి ఇంతా అని కమీషన్ తీసుకుంటాడు, ఖర్చులు కాక. చుట్టుపట్ల వూళ్లకి లేబరు బ్రోకరు కూడా ఇతనే. ఊడ్పులప్పుడు, కలుపు తీతలప్పుడు, కోతలప్పుడు కూలీల్ని ఏర్పాటు చేసి ఇట్నుంచీ అట్నుంచీ కూడా పెర్సంటేజి తీసుకుంటాడు. ప్రతీ ఏటా కూడా పంట సమంగా రాలేదనీ, తుపాను దెబ్బతిన్నాననీ, వరద బాధకి తల వంచాననీ చెప్పుకుని అన్నగారి కుటుంబానికి చేసే "సాయం" నుంచీ ప్రభుత్వానికి చెల్లించవలసిన ఋణాల వాయిదాల వరకూ మాఫీ చేయించుకోవాలని నిరంతరం వ్యధ చెందుతూ ఉంటాడు. ధాన్యం కొనుగోలు ధర పెరగలేదే అని ఆందోళన చెందుతూ చేస్తూ వుంటాడు.

మర్నాడు సాయంకాలం మెరకపొలంలో ప్రత్యేకంగా కట్టించిన "అతిథి గృహానికి" చేర్చాడు నన్ను సింహాచలం. గ్రామ సర్పంచ్ నుంచి మొదలుపెట్టి జడ్.పీ. అధికార్ల వరకు రెవెన్యూ ఉద్యోగస్తుల వరకు, బాంక్ ఆఫీసర్లవరకు అఖరికి ఆ నియోజక వర్గం ఎమ్మెల్యే వరకు ఆ గెస్టు హవుసులో మకాం చెయ్యని (సుఖాలందని) వారు అరుదు అని తెలిసింది. రెండు బెడ్ రూములూ ఎంతో అధునాతనంగా ఉన్నాయి. గాడ్రెజ్ బీరువాలో ఉన్నది మరీ అంత గొప్ప కలెక్షను కాదుగానీ అదునుకి మించిన మదిరా సంచయం ఉంది. "కేష్ పెట్టెతోబాటు ఐస్ పెట్టెకూడా" వుంది. ఇరవై నాలుగ్గంటలూ కాపలా ఉండే "అమ్మతల్లి" గాడు రండికీ మొండికీ ఓర్చే కండబలం గల వస్తాదు.

ఆ రోజు పార్టీలో సర్పంచిగారూ వారి బావమరిదీకాక, ఎమ్మెల్యే గారి తమ్ముడూ మున్సబుగారూ, పక్క వూరి లేబరు దేవుళ్లా చూసుకొనే మేష్టరూ ఉన్నారు. అన్నీ అమర్చి పెడుతున్న అమ్మతల్లిగాడు చాటుకెళ్లి తాగుతున్నట్టు నాలాగే గమనిస్తున్న మునసబుగారు వాడి చెవి పట్టుకుని అవతలికి లాక్కెళుతూ "ఒర్నంజకొడకా, నువ్వవ్వుటైపోతెలాగైహ్" అన్నాడు.

రాత్రి తొమ్మిదిన్నర కాకముందే భోజనాల కేరియర్లు వచ్చాయి. వెంటనే గ్లాసులు దాచేసి పావుగంటలో అందర్నీ వదల కొట్టేశాడు సింహాచలం. నన్ను కూడా రెండో గదిలో సెటిల్ చేసాడు. "ఇక్కడ రెండు మంచాలున్నాయి కదా, కబుర్లు చెప్పుకుంటూ పడుకోవచ్చు కదా" అన్నాను. "ఒల్లకొండి బాబూ, మీకేటీ తెల్దు!" అన్నాడు అమ్మతల్లిగాడు.

అలవాటు లేని చోటు కదా. అంచేత నిద్దరపట్టలేదు నాకు. రాత్రి పన్నెండు దాటేక సింహాచలం నేనున్న గదిలోకొచ్చి అక్కడున్న రెండో మంచం మీద కూర్చున్నాడు. లైటేసి, "ఇంకా నిద్దర్రాలేదా సార్?" అన్నాడు. చేతిలో గ్లాసుంది. పల్లెటూరి వాళ్లని పట్నం బాబులు దగా చెయ్యడం గురించి మళ్లీ ఎత్తాడు. అధికారం, సుఖాలూ, సంపదా అన్నీ పట్నంబాబుల సొత్తయిపోయాయన్నాడు.

నా చేతులో గ్లాసులేదు గానీ, నేనుకూడా వూరుకోలేదు.

"అలాగాగు. నన్ను చెప్పనీ" అని మంచంమీద లేచి కూర్చున్నాను. "నువ్వు పల్లెటూరాడివి. నేను పట్నం వాణ్ణి. ఏం అంతేనా, ఇప్పుడు చెప్తాను చూడు. మీకున్న రాయితీలు మాకెప్పుడేనా ఉంటాయా? అహ.. అడుగుతున్నాను. పన్నుల దగ్గిర్నించీ రుణాల దాకా ప్రభుత్వం మాఫీ చేస్తోంది మాకా, మీకా? 540 మంది లోక్‌సభ సభ్యుల్లోనూ 290 మంది అసెంబ్లీ సభ్యుల్లోనూ పల్లెటూర్ల నించొచ్చే వాళ్లెక్కువా, పట్నం వాళ్లా? పల్లెటూరి వాళ్లే ఎక్కువ. ఏం? ఒక సీటుకి పట్నం బాబూ పల్లె మనిషీ నిలబడ్డారనుకుందాం. ఎవరు గెలుస్తున్నాడు? విశ్వనాథం గార్ని చిత్తుకింద ఓడించేడు సత్తెన్నారాయణ గారు. కె.ఎల్.రావు గారు పులుసులోకి లేకుండా పోయింది ఎవడి చేతుల్లో? అంతెందుకు? మొన్న ఎన్.టి.ఆర్. ఒక పల్లెటూరి బాబు చేతిలో ఓడిపోలేదా? ఇంక, మోసంజేయడం అంటున్నావు కద. విను! అట్టడుగు వర్గాల ప్రజల్ని మీరు అణగదొక్కినంత సదుపాయంగా పట్నవాసం వాళ్లు అణగదొక్కలేరు.

"పరిశ్రమల్లో, కర్మాగారాల్లో ఉన్న లేబర్ని అణాడబ్బుల దగ్గిర దగా చేస్తే దొరికిపోతారు. కానీ పల్లెటూరి వ్యవసాయ కార్మికుల్ని అర్ధాకలితో మాడ్చి తరాలు తరాలుగా పిడికిట్లో ఉంచీసుకోవచ్చు. రోడ్లు పడ్డాయి. కరెంటు ఒచ్చింది, స్కూళ్లొచ్చేయి. ఏదొచ్చినా పల్లెపట్టులో కామందుల్ని సుఖ పెడుతున్నాయి తప్పా పట్నంవాసంలోని మధ్యతరగతినీ పేద తరగతినీ కాదు. కాంట్రాక్టులు చేసీ వ్యాపారాలు చేసీ ధనికులవుతున్న పట్నవాసం మేధావుల సంఖ్య కంటే భూమిని మచ్చిక చేసుకుని వ్యవసాయ కార్మికుల్ని అదుపులో పెట్టి ముందుకొస్తున్న పల్లెపట్టు మేధావుల సంఖ్యే ఎక్కువ. పట్నవాసంలో ఉన్న సదుపాయాల్లో సౌఖ్యాల్లో పల్లెకి దిగనిది అంటూ ఏదీలేదివాళ. అయితే అవి అనుభవించడానికి అవసరమయ్యే స్వేచ్ఛ పరిమాణం ఇక్కడే ఎక్కువ. మాట వరసకి పట్నవాసంలో ఉన్న గొప్పవాళ్లలో ఎంతమంది ఇలా విడిగా గెస్టు హౌసులు కట్టించుకుని ధైర్యంగా సుఖపడ గలుగుతున్నారు? ఆస్తుల ఆక్రమణలతో, కులం మతం కారణాలుగా వేసుకునే తగాదాలతో పల్లె జనం దావాలేసుకొని కోర్టుల కెక్కకపోతే కేసులే ఉండవసలూ. ఇహ, పల్లెటూర్లలో లా ఎండ్ ఆర్డర్ ధనస్వాముల హక్కుగా స్థిరపడింది గనకా పల్లెటూరి జనాన్ని మోసం చేసేది పల్లెటూరి మోతుబర్లే తప్ప పట్నవాసం జనం కానేకాదు'.

"మీరెన్నయినా చెప్పండి, పట్నం బాబులు పల్లెటూరి వాళ్లని దగా చేస్తూనే ఉన్నారంటాను. దేవీలాలుగారు కూడా మొన్న ఇదే అన్నారు."

అమ్మతల్లి గాడొచ్చేడు. సింహాచలంచేతిలో ఉన్న ఖాళీగ్లాసు అందుకున్నాడు. "ఎల్లి తొంగొండి బావూ" అన్నాడు.

"దిగబెట్టేసేవా?"

"ఒల్రయిటుగా. నెగండి" అన్నాడు అమ్మతల్లిగాడు.

మర్నాడు నన్ను సగౌరవంగా సాగనంపేడు సిహాచలం. బస్సు టిక్కెట్ డబ్బులూ, మరో పది రూపాయల నోటూ కండక్టర్ కిచ్చి, "టాప్‌మీద బియ్యం బస్తా ఏయించేను. జాగర్తగా దింపించి ఐగారికి ఒప్పగించు" అని చెప్పేడు.

నాలుగు రోజులు సింహాచలంతో గడిపినందుకు ఇలా అడక్కుండా లబ్ధిపొందేను. కాని ఎవరు ఎవర్ని మోసం చేసేరో నాకు అర్థం కాలేదు. ★